రెచ్చిపోతున్న దొంగలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో దొంగలు పెచ్చు మీరుతున్నారు. సాక్షాత్తు తిలక్ రోడ్లోని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని శ్రీనివాస్ వారి ఇంటి ఎదురుగా ఉన్న బిజెపి నాయకులు యెనుముల రంగబాబు సోదరులు యెనుముల బ్రహ్మానందం నివాసంలో నిన్న రాత్రి దొంగలు పడి సర్వం దోచుకున్నారు. ఈ మధ్య కాలంలో నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయి. రాజమహేంద్రవరం సిటీ చుట్టు పక్కన గ్రామాల్లో ఒంటరిగా వెళ్తున్న వారిని టార్గెట్ చేసుకొని దోపిడీ చేయడం బ్లేడ్ బ్యాచ్ కి పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి ధవళేశ్వరంలో 1000 రూపాయల కోసం ఒక యువకుడిని అతి దారుణంగా చంపేయడం వంటి సంఘటనలు భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి.

ఆర్థిక బంధాల కంటే మానవ సంబంధాలు ప్రధానమని చాటిన నాటకం

విశాలాంధ్ర - అనపర్తి : సమాజంలో ఆర్థికంగా స్థిరపడితే చాలు కుటుంబం, సమాజం తో పనేమీ లేదనుకుంటూ ధన వ్యామోహంలో పడి సాటి మనుషులను సైతం లెక్కచేయని మార్కండేయులు లాంటి వ్యక్తులకు కోడలు వైశాలి ఎలా కనువిప్పు కలిగించిందో చెబుతూ నేటి సమాజానికి కుటుంబ విలువలు చాటి చెప్పిన సిరి గంధం నాటకం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మంగళవారం పొలమూరులో శ్రీ శారద కళానికేతన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా సిరి గంధం సాంఘిక నాటిక ప్రదర్శన నిర్వహించారు. శ్రీ స్నిగ్ధ రచనలో సీనియర్ నటులు, దర్శకుడు తాడి సుబ్బారెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటికం ద్వారా ఆర్థికంగా ధనవంతుడైన కుటుంబ యజమాని, ధన వ్యామోహంలో పడి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం, బంధువుల ఆస్తిని కూడా స్వంతం చేసుకోవాలని కుట్ర చేయడం, మానవీయ విలువలు మర్చిపోయి జీవించడాన్ని మార్కండేయులు పాత్ర ద్వారా సుబ్బారెడ్డి సజీవంగా చూపించారు. ఇక మార్కండేయులు భార్యగా శ్రీలేఖ, కోడలిగా వైశాలి పాత్రలో సరిత,కొడుకుగా రామారెడ్డి, ఇతర పాత్రల్లో సత్తిబాబు, చావలి శ్రీనివాస్ తమ నటనతో పాత్రలకు జీవం పోశారు.

విశిష్ట వ్యక్తులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - అనపర్తి : శ్రీ శారద కళానికేతన్(పొలమూరు) ఆధ్వ ర్యంలో ఏటా విశిష్ట వ్యక్తులకు చేస్తున్న సత్కార కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా జైలర్ కర్రి వెంకటరెడ్డి, పొలమూరు ఓం శక్తి సత్సంఘ అధినేత మల్లిడి వీర్రాఘవరెడ్డి, సత్తి వీర్రాఘవరెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త తేతలి ఉపేంద్రరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, షుగర్ వ్యాధి నిపుణులు తాడి రామగురెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని విశిష్ట అతిథులను సత్కరించారు. కళానికేతన్ ద్వారా సమాజ హితానికి సందేశాన్ని అందిస్తూ చేస్తున్న సేవలు, నాటక ప్రదర్శనలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనపర్తి డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి వీర్రాఘవ రెడ్డి, మల్లిడి నాగిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి (వైజాగ్), నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి (కొండబాబు), ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి , సమితి సభ్యులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంగీత విభావరి

విశాలాంధ్ర - గోపాలపురం : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధు కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ముఖ్య అతిథిగా

విచ్చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గన్నమని వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ ఆర్ అండ్ యం ఫౌండేషన్ సేవలను కొనియాడారు. యువత వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు సుమారు 15 రోజుల నుండి క్రికెట్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయిలోనే మంచి గుర్తింపు పొందిందని తెలిపారు. యువత క్రీడలపై ఆసక్తిని కనబరిచి దేహదారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గన్నమణి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయ పండుగలైన సంక్రాంతి ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా జరపడాన్ని ఆయన అభినందించారు. అనంతరం యాంకర్లు రవి, శ్యామల, ప్రముఖ సినీ గాయనీ గాయకులు గీతా మాధురి, శ్రావణి భార్గవి, వాగ్దేవి, సాకేత్, అరుణ్, హనుమాన్, లు సినీ, జానపద, భక్తి గీతాలను ఆలపించారు. జబర్దస్త్ టీం సద్దాం ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నిర్వాహకులు పిన్నమనేని చిన్నబాబు, కొర్లపాటి రాము, గోపాలకృష్ణ, కోయ శేఖర్, కొర్లపాటి రాజా, అశేష జనవాహిని పాల్గొన్నారు.

పైలాను పరామర్శించిన బీసీ నాయకులు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఇటీవల రాజమండ్రిలో ప్రమాదానికి గురైన తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి పైలా సుభాష్

చంద్రబోస్‌ను నియోజకవర్గం లోని ప్రత్తిపాడు శంఖవరం రౌతులపూడి మండలాలకు చెందిన బీసీ నాయకులు దాడి నూకరాజు, కిల్లాడి బాబ్జి, కిలపర్తి శ్రీనివాస్‌లు పైలాను పరామర్శించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని బోస్ తొందర్లోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైదానం నూకరాజు, ముచ్చి అప్పలరాజు, పైలా అయ్యప్ప, సతివాడ రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

17 కేసులు నమోదు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని సంక్రాంతి మూడు రోజులు పేకాట గుండాట కోడిపందాలు నిర్వహించిన వారిపై 17 కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కోడి కత్తులు కట్టేవారిని, కోడిపందాలు ఆడే వారిని 25 మందిని గుర్తించి వారిపై స్థానిక తాసిల్దారు చేత బైండ్ ఓవర్ చేయించి 100 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పండుగ సందర్భంగా మూడు రోజులు కోడిపందాలు ఆడిన వారిని, గుండాట ఆడే వారిని 30 మందిపై కేసులు నమోదు చేసి 100 గుండాట బోర్డులను, 60 గుండాట గుళ్లను, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను స్థానిక సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, విద్యుత్ భవన్, రాజమహేంద్రవరం వారి కార్యాలయం / ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆపరేషన్, రాజమహేంద్రవరం, కాకినాడ, జగ్గంపేట, రామచంద్రపురం, అమలాపురం, రంపచోడవరం కార్యాలయంలో జనవరి 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందని పర్యవేక్షక ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, రాజమహేంద్రవరం టి. వి. యస్. ఎన్. మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించిన సూచనలు అభ్యంతరాలు వింటారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు, మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహిస్తారని, సందేహాలు, సలహాలు సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చు.

ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం యూజే పురం కొత్తూరు వైఆర్‌సి కాలవ వద్ద ఉన్న సాయిబాబా మందిరం వద్ద సంక్రాంతి పురస్కరించుకుని గొర్లి రాజబాబు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీ నిర్వహించారు. అనంతరం ముగ్గులు పోటీ విద్యార్థులకు బహుమతులు తేట కాయలు నూకరాజు, అగ్గియ్య, వట్టి కోళ్ల దివాణం, మామిడాల సూరిబాబు, పగడాల రవణమ్మ, మైనాల శివ, కడిమి కృపానందం, ఆకేటి సత్యనారాయణ, తేటకాయల పూర్ణయ్య, చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అనేక నెలలుగా పేపర్ మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమాలు నిర్వహిస్తున్నా రాజమండ్రి ఎంపీ భరత్ ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా ఆయన నోరు విప్పాలని యాజమాన్యం మొండి వైఖరిపై మాతో కలిసి రావాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మంగళవారం సిఐటియు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఏడవ రోజు జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సీనియర్ కార్మిక నాయకులు శివరాం సుబ్రహ్మణ్యం పేపర్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు వచ్చి సంఘీభావం ప్రకటించారు. ముందుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ పరంపర టు ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుం దని ఆయన విమర్శించారు.

20వ తేదీ నుండి పోరాట కార్యక్రమం ఉవ్వెత్తున ఉంటుందని దానికి జెండాలు పక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని అరుణ్ కోరారు. మధు మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికలు వెంటనే జరగాలని, క్యాంటీన్ రేట్లు తక్షణమే తగ్గించాలని మధు డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులను సీనియార్టీ ప్రకారంగా పర్మినెంట్ చేయాలని మధు డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఐఎన్‌టియూసీ దాసు, పేపర్ మిల్ యూనియన్ నాయకులు రాజేష్ అప్పారావు, జీఏ రామారావు, సిపిఐ నగర కార్యదర్శి, వి. కొండలరావు, వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

అపూర్వ కలయిక...ఆత్మీయ వేదిక

విశాలాంధ్ర - అంబాజీపేట : వారంతా 28 ఏళ్ల క్రితం పదవతరగతి చదివిన విద్యార్థులు. మరలా ఇన్నాళ్లకు అపూర్వంగా కలిసి ఆత్మీయతలు పంచు కున్నారు. ఇందుకు మంగళవారం స్థానిక

హైస్కూలు వేదిక అయ్యింది. 1994-95లో పదవ తరగతి చదివిన వారిలో, ప్రస్తుతానికి కొందరికి చేతికి అందివచ్చిన కొడుకులు, పెళ్లీడుకొచ్చిన కుమార్తెలు కూడా ఉన్నారు. అయితేనేం...వారందరూ గత స్మృతులు నేమరు వేసుకొంటూ చిన్నారులుగా మారిపోయారు, ఆడారు...పాడారు...తాము కుటుంబాలతో వచ్చాం అనే విషయాన్నే మర్చి పోయారు. ఆనాటి నిక్ నేమ్ లతో పిలుచుకున్నారు. తాము విద్యనభ్యసించిన తరగతి గదిలో ఆనాడు తాము కూర్చున్న బెంచీలలో కూర్చుని తన్మయత్వం చెందారు. స్నేహ బంధం ఎంతో మధురమైనది జీవితాంతం తరిగిపోదు...చెరిగిపోదని నిరూపించారు. తమ మొదటి స్నేహం ఏర్పడేది పాఠశాల స్థాయిలోనేనని... తాము ఎప్పుడు, ఎక్కడ కలిసినా ఏరా...పోరా అని ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉందామని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ భవిష్యత్ గడుపుదామని బాసలు చేసుకున్నారు. అంబాజీపేట విద్యార్థుల అపూర్వ కలయికతో కలుసుకున్నారు. 1994-95 బ్యాచ్ 28 ఏళ్ళ ఆనాటి అనుభూతులను ఒకరికొకరు గుర్తు చేసుకుని నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంతో పలకరించుకొంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ప్రస్తుత వారి పరిస్థితి, వారు చేసే ఉద్యోగం, కుటుంబ పరిచయాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో తొలుత సరస్వతీ దేవి విగ్రహానికి, పూలమాలలు వేశారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి, మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు గురువులు మాట్లాడుతూ గురువు లేని విద్య గుడ్డి విద్య అని అన్నారు. సమాజంలో సంఘంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగల పౌరుల్లాగా ఎదగాలని ఆకాంక్షించారు.

పలువురికి సన్మానం : 1994, 1995 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులై ప్రస్తుతం రాజకీయ నాయకులుగా సామాజిక సేవకులుగా ఉన్న, పెళ్లి జరిగి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి గ్రూప్ అడ్మిన్స్ జైను లక్ష్మణ్ కుమార్, కొప్పిశెట్టి రాంబాబు, అధికారపు కృష్ణవేణిల ఆధ్వర్యంలో స్నేహితులందరి సమక్షంలో ఘనంగా సన్మానించారు.

కిడ్నీ బాధితుడికి కలెక్టర్ చేయూత

విశాలాంధ్ర - కాకినాడ : కోటనందూరు మండలం, ఎస్ఆర్ పేటకు చెందిన

అన్నంరెడ్డి రాము సంవత్సర కాలం నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నర్సీ పట్నం పర్యటన సందర్భంగా ఆయనను కలిసి తన సమస్యను వివరించి ఆదుకోవాలని అభ్యర్థించాడు. రాము నిస్సహాయ పరిస్థితికి చలించిన ముఖ్యమంత్రి అతనికి వైద్య సహాయం అందించాల్సిందిగా కాకినాడ జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈమేరకు మంగళవారం రాము జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాను కలువగా, కోటనందూరు మెడికల్ ఆఫీసర్, డియంహెచ్‌ఓలతో అతని చికిత్స నిమిత్తం అవసరమైన ఏర్పాట్లు పై చర్చించి సత్వరం కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అతని చికిత్సకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం తరఫున అందజేయనున్నట్టు జిల్లా కలెక్టర్ భరోసా కల్పించారు. తన సమస్యపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ఆనంద భాష్పాలతో రాము ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన సంక్రాంతి ఆటల, ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : ఇంద్రపాలెంలో గత 3రోజులనుండి తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో కొప్పిసెట్టి నాగబాబు, కాదా ప్రసాదరావు, టేకుమూడి

ప్రసాద్, రాంబాబు, మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఎంసీ చైర్మన్ గీసాల శ్రీను మాట్లాడుతూ సంప్రదాయ ఆటలు మానసిక ఆనందం, కుటుంబ సభ్యులకు ఆహ్లాదం కలుగుతాయన్నారు. జూదం, కోడి పందాలకు పోకుండా పోటీలలో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పార్టీ భేదం లేకుండా అందరూ కుటుంబంలా ఈ వేడుకలలో పాల్గొన్న గేసాల శ్రీను, వేదిక పై ఉన్న పెద్దలు అందరికి కృతజ్ఞతలు అభినందనలు తెలియచేసారు. జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వుపెంకే శ్రీనివాస బాబా మాట్లాడుతూ ఈ వేడుకలలో పాల్గొని మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. యాదవ సంఘ జిల్లా అధ్యక్షులు గంగయ్య సుబ్రహ్మణ్యం, గుడి చైర్మన్ మాధవ తదితరులు ప్రసంగించారు. మిక్సీ, కుక్కర్, వెండి పట్టీలు మొదలగు విలువైన వస్తువులు బహుమతులు అంద చేశారు. కార్యక్రమానికి సహకరించిన పేరా బత్తుల రాజశేఖర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరూ నాగబాబు, ప్రసాద్ మిత్ర బృందాన్ని అభినందించారు.

సినీనటులతో అంబరాన్నంటిన సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : సినీ నటులతో గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురంలో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. జెడ్పీటీసీ సభ్యులు పరిమి

వెంకటలక్ష్మి మంగతాయారు బాబు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో సినీనటులు పాల్గొనడంతో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సంక్రాంతి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. మూడు రోజుల పాటు ఫ్లడ్ లైట్‌ల వెలుతురులో జరిగిన వాలీబాల్ పోటీలలో సుమారు 20 టీమ్‌లు పాల్గొనగా వాటిలో ప్రథమ బహుమతి ఎన్టీ రాజాపురం, ద్వితీయ బహుమతి కోలమూరు, తృతీయ బహుమతి దోసకాయలపల్లి, నాలుగవ స్థానాన్ని మర్రిపాక కైవసం చేసుకున్నాయి. వారికి సినీ నటుడు సమీర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వాతావరణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి వేడుకలు చాలా ఆనందాన్ని కలిగించాయన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటులు సమీర్, హేమ, రజిత, శివ బాలాజీ, జ్యోతి, కృష్ణుడు తదితర సినిమా ఆర్టిస్టులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : మహాధర్నా వాల్ పోస్టర్స్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు అమలాపురంలో అమరజీవి చింతపల్లి కృష్ణమూర్తి స్మారక స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కమిటీ సభ్యులు మట్టపర్తి ప్రసాద్, కురచ నాగేశ్వర రావు, సంపర లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు ఇళ్ళ రామచంద్రరావు, జుట్లు లేబర్ యూనియన్ నాయకులు మాచరయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోస్టర్ ఆవిష్కరణ తో పార్టీ శ్రేణులు ప్రజాసంఘాలు కదిలి కార్యాచరణను ప్రారంభిస్తారని జిల్లా కార్యదర్శి సత్తిబాబు తెలిపారు.

రాజోలులో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - రాజోలు : సీపీఐ రాజోలు నియోజకవర్గంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లుబోయిన తాతారావు ఆధ్వర్యంలో మహాధర్నా వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ

సీనియర్ నాయకులు, రైతు ఉద్యమ నేత సిహెచ్ కేశవ శెట్టి, పార్టీ సఖినేటిపల్లి మండల కార్యదర్శి గెద్దం ప్రభాకర్, జిల్లా సమితి సభ్యులు జంపన ప్రసాదరావు, వ్యవసాయ జిల్లా నాయకులు గంగాజలం, రైతు సంఘం జిల్లా నాయకులు బుచ్చిబాబు, అంతర్వేది పార్టీ శాఖ కార్యదర్శి దొండపాటి ఆధామ్, నరసింహారావు, గేదల కోటేశ్వరరావు, గేదెల తిరుపతి తదితరులు హాజరయ్యారు.

గోవాలో స్మార్ట్ సిటీల వర్క్ షాపు

- 23,24 తేదీల్లో నిర్వహణ

- ఐసీసీసీ పనితీరుపై చర్చ, హాజరుకానున్న కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో గోవాలో డేటా & టెక్నాలజీ పై వర్క్ షాప్ జరగనుంది. దేశంలోని 100 స్మార్ట్ సిటీ నగరాలకు సంబంధించిన సీఈవోలు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి కూనల్ కుమార్

పర్యవేక్షణలోఈ సదస్సు జరగనుంది. కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సీఈవో, ఎండి కే రమేష్ గోవా సదస్సుకు హాజరు కానున్నారు. అనేక స్మార్ట్ సిటీ నగరాలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్స్ (ఐసీసీసీ) పనితీరు, ప్రయోజనాలు, మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవ లసిన చర్యలపై గోవా వేదికగా సీఈవోలు అభిప్రాయాలను పంచుకో నున్నారు.

రూ.98 కోట్లతో కాకినాడలో : జిల్లా కేంద్రం కాకినాడలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) అత్యంత సమర్థ వంతంగా పనిచేస్తోంది. స్మార్ట్ సిటీలో ఎంపిక చేసిన ముఖ్యమైన 350 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానంగా పనిచేసేలా రూపకల్పన చేశారు. కాకినాడ సిటీలోని ట్రాఫిక్ లైట్లను కూడా సీసీసీ పర్యవేక్షిస్తోంది. దాదాపు 470 ప్రాంతాల్లో వైఫై నెట్వర్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచెప్పేలా నగరంలోని 12 చోట్ల ఎన్విరాన్మెంట్ సెన్సార్లు కూడా పనిచేస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన పబ్లిక్ కాల్ సెంటర్ ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తోంది. వీటన్నింటినీ గోవాలో జరిగే వర్క్ షాప్‌లో స్మార్ట్ సిటీ సీఈవో రమేష్ వివరించనున్నారు.

ఎస్పీకి బీజేపీ నేత ప్రశంస

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా పార్టీ అమలాపురం పార్లమెంటు తరఫున ఎస్పీ పి.సుధీర్ కుమార్ రెడ్డికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జూదాలు అరికట్టడంలో ఎస్పీ సుధీర్ కుమార్ పాత్ర చాలా అభినందనీయమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. పేకాటలు,

గుండాటలు వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఇటువంటి చర్యలు తీసుకోవడం వల్ల ఎన్నో కుటుంబాలు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేసిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకటరామారావు, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్చార్జ్ దూరి రాజేష్, అమలాపురం టౌన్ ఉపాధ్యక్షుడు కే సాగర్, అమలాపురం టౌన్ ప్రధాన కార్యదర్శి అరిగిల తేజ వెంకటేష్, ఈతకోట బాలస్వామి, సన్మానించిన వారిలో ఉన్నారు.

వీరుళ్లమ్మ జాతర

విశాలాంధ్ర - అనపర్తి : ప్రజలంతా శాంతి,సామరస్యాలు, ఆరోగ్యం, ఆనందాలతో జీవించేలా గ్రామ దేవత వీరుళ్ళమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం వీరుళ్ళమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు పురస్కరించుకుని కాయల వెంకటరెడ్డి వీరుళ్ళమ్మ అమ్మవారిని దర్శించు కున్నారు. అనంతరం కమిటీ సభ్యులు కాయల కు శాలువా కప్పి, వీరు ళ్ళమ్మ తల్లి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో గావు గంగమ్మ ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్),వీరుళ్ళమ్మ కమిటీ సభ్యులు సత్తి రామ కృష్ణారెడ్డి,పడాల కళ్యాణ్ రెడ్డి, చిర్ల సతీష్ రెడ్డి, సత్తి వెంకట రామారెడ్డి, మేడపాటి శివారెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

నా యొక్క జె 7365796 నెంబరు గల పాస్ పోర్టును ది.15-01-2023న ఆత్రేయపురం మండలం, అంకంపాలెంలో జిరాక్సు తీయించుటకు వెళ్ళుచున్న సమయంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రసుకు తెలుపగలరు.

కొడమంచిలి నాగేంద్ర కుమార్,
S/o. సత్యనారాయణ, అంకంపాలెం.
డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 99894 84865

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

'లోక్ నాయక్' పురస్కారానికి డాక్టర్ గన్ని ఎంపిక

విశాలాంధ్ర-రాజానగరం: సమాజానికి వివిధ రంగాల్లో ఉన్నత సేవలందించిన పలువురు ప్రముఖులకు ప్రతి ఏటా అందించే 'లోక్ నాయక్' జీవన సాఫల్య పురస్కారానికి జిఎస్ఎల్ వైద్య కళాశాల వ్యవస్థాపకులు, ప్రముఖ సర్జన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి ఆసుపత్రి వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. ఈ



సందర్భంగా డాక్టర్ గన్ని భాస్కరరావును సోమవారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. దీనిలో భాగంగా ఆసుపత్రికి చెందిన వివిధ శాఖల అధిపతులు మాట్లాడుతూ కోవిడ్ విజృంభణ సమయంలో డాక్టర్ గన్ని భాస్కరరావు వినూత్నంగా ఆలోచించి ప్రజల ప్రాణాలు నిలిబెట్టినందుకుగాను జీవన సాఫల్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నేతృత్వంలో ఈ పురస్కారం వరించినట్లు చెప్పారు. ఈ నెల18న విశాఖపట్నంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జరగనున్న సభలో పూర్వపు ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటారన్నారు. గన్నితో పాటుగా కూచిభొట్ల ఆనంద్ (అమెరికా), కోనేరు సత్యనారాయణ (విజయవాడ) జీవనసాఫల్య పురస్కారాలు అందుకోనున్నారు. ఎన్టీఆర్ శత జయంతి పురస్కారాలను సినీ దర్శకులు కె.రాఘవేంద్ర రావు, నటీమణులు జయసుధ, జయప్రదలు అందుకుంటారని తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, ముఖ్యఅతిథిగా పూర్వపు ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు.

సామాజిక విప్లవానికి శ్రీకారం

విశాలాంధ్ర - రామచంద్రపురం : దేశంలో మరే రాష్ట్రం కనీసం ఊహించని విధంగా రాష్ట్రంలో సామాజిక మహా విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో

భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని 24 వార్డులో గడపగడపకు తిరిగారు. ఈ సందర్భంగా మంత్రి 24 వార్డులో గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాల్లో అందిస్తున్న లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ ప్రభుత్వం పరంగా తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. అమ్మఒడి, విద్యా దీవెన, విద్యా కానుక, ఆసరా, చేయూత, వసతి దీవెన, పెన్షన్లు, గృహ నిర్మాణాలు, రైతు భరోసా, గోరుముద్ద లాంటి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును మంత్రి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా డ్రైనేజీ సమస్య పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలతో పాటు స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రికెట్ విజేత గురజనపల్లి జట్టు

విశాలాంధ్ర - కరప : మండల కేంద్రమైన కరప గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ట్రోఫీ విజేతగా గురజానపల్లి జట్టు నిలిచినది. గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రమైన కరప గ్రామంలో స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్

పోటీల్లో భాగంగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సిఏకె) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ సంవత్సరం యాళ్ల వెంకటరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌గా నిర్వహిస్తున్నట్టు సిఏకె అధ్యక్షుడు, ఉభయగోదావరి జిల్లాల క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు దేవు మధు వీరేష్ తన సొంత ఖర్చులతో తన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంటులో మండల వ్యాప్తంగా 30 జట్లు ఈ టోర్నమెంట్‌లో పోటీపడ్డాయి. మంగళవారం గురజనాపల్లి కరప ఫ్రెండ్స్ లెవెన్ జట్లు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గురజనాపల్లి జట్టు 6 వికెట్లు తేడాతో విజయం సాధించింది.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం గ్రామంలోని పువ్వాడ సత్యమాంబా మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళ వారం 1987-88 విద్యా సంవత్సరం పదవ తరగతి

చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. దీనిలో భాగంగా పాఠశాలలో ఉదయం నుండి పూర్వ విద్యార్థులు వివిధ కార్యక్రమాలలో పాల్గొని వయసు మరచి ఉల్లాసంగా ఆటపాటలతో కాలక్షేపం చేశారు. ప్రతీ విద్యార్థికి మెమెంటోను జ్ఞాపకార్థంగా నిర్వాహకులు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి కారణమైన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - గండేపల్లి : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు అన్నారు. సంక్రాంతి సందర్భంగా గండేపల్లి మండలం మల్లేపల్లిలో అనపరాజుపేటలో శ్రీ సీతారామ కమిటీ వారిచే కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సాంప్రదాయ క్రీడలతో సరదాగా గడపాలన్నారు. కోడి పందాలు, జూద క్రీడలు, చట్టరీత్యా నేరమని కావున యువత పెడదోవన పట్టకుండా, సాంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామానికి, ద్వితీయ స్థానం మల్లేపల్లి గ్రామానికి, తృతీయ స్థానం మురారి గ్రామాలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన టీమ్లకు షీల్డ్‌తో పాటు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, గొర్రెల శివ, బలిరెడ్డి శివ, కలీం శివ,బలిరెడ్డి శ్రీను, మండే చిన్నబ్బు, కూళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర - కరప : కరప మండలం అరట్లకట్ట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న శిబిరం పై దాడులు చేసి ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్టు కరప ఎస్సై నౌడు రామకృష్ణుడు తెలిపారు.

వీరి వద్ద నుండి రూ.13,680 నగదును, పేక ముక్కలను సేకరించి వీరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.